క్లుప్తంగా

పారిశుధ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మెట్‌పల్లి: పట్టణంలో పారిశుధ్యంపై శనివారం కళాబృందాలతో అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అవగాహన కల్పించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి కాల్వలో చెత్త వెయొద్దని, మున్సిపల్ ఆటోలకు అందించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, సిబ్బంది,కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి



సీనియర్ సిటిజన్లను అభినందిస్తున్న ఆర్డీవో

జగిత్యాల: ప్రతీ ఒక్కరు సీనియర్ సిటిజన్లను గౌరవించాలని ఆర్డీవో మధుసూదన్ అన్నారు. శనివారం సీనియర్ సిటిజన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో అభినందనీయమని, వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. సీనియర్ సిటిజన్ల హక్కులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఆరాధనోత్సవాలు



ఉత్సవాల్లో విశ్వకర్మ సంఘం ప్రతినిధులు

జగిత్యాలటౌన్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి అయిన వైశాఖ శుద్ధ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జగిత్యాల పట్టణంలోని పురాణిపేట విశ్వకర్మ సత్సంగ్ భవన్‌లో విశ్వకర్మ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో యోగా గురూజీ వంగళ భాస్కరా చారి, టీవీ సత్యం, తవుటు రాంచంద్రం,పూర్ణచందర్, సత్యనారాయణ, సత్సంగ్ సభ్యులు, మాతలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

మెట్‌పల్లి: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి అన్నారు. శనివారం మెట్‌పల్లిలో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుందని, అధికారులు దృష్టి సారించి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలన్నారు.రైతులు మార్కెట్ యార్డుల్లో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.కార్యక్రమంలో నాయకులు సురజ్, బాలరాజ్, అమర్,సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన గంగరాజం వెన్నెముక సమస్యతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం రూ. 2.50 లక్షలు ఎల్‌వోసీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేయించగా, శనివారం అందించినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు తెలిపారు. ప్రభుత్వ విప్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు బంద్ చేయడం సరికాదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ట్ లైట్లను రాత్రి 9 గంటల తరువాత బంద్ చేయాలని అనడం సరికాదని గ్రామస్తులు అంటున్నారు. హైమాస్ లైట్లతో విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకే వీటిని వెలిగించాలని అధికారులు చెప్పడంపై సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. రాత్రి పూట అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, రాత్రి గ్రామంలో చీకటి ఉండకుండా గ్రామంలోని వివిధ కూడళ్లలో 12 హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. అధిక విద్యుత్ బిల్లులు వస్తున్నాయని జీపీ సిబ్బంది వీటిని రాత్రి బంద్ చేయాలనడం సరికాదని అధికారులు ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అకాల వర్షం.. అన్నదాత ఆగమాగం

- కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం బస్తాలు
- నత్తనడకన సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- కోతలు పెడుతున్న మిల్లరు
- కొనుగోలు వేగవంతం చేయాలని రైతుల వేడుకోలు



కొనుగోలు కేంద్రంలో ధాన్యపురాశుల చుట్టూ నిలిచిన నీరు

వెల్గటూర్: అకాల వర్షాలకు రైతులు ఆగమవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి చెడగొట్టు వానలు రైతుల కష్టాన్ని నీటిపాలు చేస్తున్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నీరు నిలిచి ధాన్యం మొత్తం నీట మునిగింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులను పట్టించుకోవడం లేదు.

నత్తనడకన సాగుతున్న కొనుగోళ్లు

పంటకోతలు దాదాపు పూర్తయినా, సెంటర్లు ప్రారంభించి సుమారు రెండు నెలలు కావస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఉమ్మడి వెల్గటూర్, ఎండపల్లి మండలాల పరిధిలో మొత్తం 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోళ్లు ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ సుమారు 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయలేదు. వర్షాకాలం సమీపిస్తుండడంతో త్వరగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

లారీల కొరత

కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. తూకం వేసిన ధాన్యం బస్తాలను రైస్‌మిల్లుల వద్ద త్వరగా దిగుమతి చేయకుండా రెండు మూడు రోజుల తరబడి లారీలు నిరీక్షిస్తుండడంతో కేంద్రాల్లో లారీల కొరత వేధిస్తుంది. లారీలు రాకపోవడంతో తూకం వేసిన ధాన్యం రెండు మూడు రోజులు రోజుల పాటు కేంద్రంలో ఉండడంతో బరువు తగ్గి తరుగు పేరుతో మిల్లర్లు కోతలు విధిస్తున్నారు. లారీల కొరతతో తూకం వేసిన ధాన్యం బరువు తగ్గుతుందని కొనుగోళ్లలో జాప్యం చేయడంతో 20 రోజులు గడిచినా రైతుల ధాన్యం కేంద్రాల్లోనే పేరుకుపోతుంది. అధికారులు స్పందించి మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకుని, లారీల కొరత తీర్చేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.



వర్షానికి తడిచిన తూకం వేసిన బస్తాలు

తూకం వేసి మూడురోజులైంది



ధాన్యం తూకం వేసి మూడు రోజులైనా లారీలు రాక మిల్లుకు తరలించలేదు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి తూకం వేసిన నా ధాన్యం బస్తాలు పూర్తిగా తడిచాయి. తడిచిన బస్తాలు దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు కోతలు విధిస్తున్నారు. కోతలు లేకుండా తడిచిన ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కంటెం సత్తయ్య, రైతు,పాశిగామ

కొనుగోలు చేయడం లేదు



కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి 20 రోజులైనా తూకం వేయడం లేదు. తూర్పారబడితేనే కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడు బస్తాకు కిలో చొప్పున మిల్లర్లు కోతలు పెడుతున్నారు. అయినా లారీలు దిగుమతి చేయకుండా రెండు మూడు రోజుల పాటు ఉంచడంతో బరువు తగ్గిందని మళ్లీ కోతలు పెడుతున్నారు. అధికారులు కోతలు లేకుండా కొనుగోలు జరిగేలా చూడాలి.

– బరుపటి ఐలయ్య, రైతు,పాశిగామ

కొనుగోళ్లలో జాప్యంపై బీజేపీ నాయకుల నిరసన





కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో, మేడిపల్లిలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. వర్షాలు కురియడంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి మొలకెత్తాయని, ప్రభుత్వం ధాన్యంను త్వరగా తూకం వేయాలని డిమాండ్ చేశారు. వర్షాలతో తడిసి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, ఏనుగు జలందర్‌రెడ్డి, కాసోజి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం బీజేపీ నాయకులు సందర్శించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా.. ఇంతవరకు 25 శాతం కొనుగోళ్లు కూడా పూర్తి కాలేదని అన్నారు. తూకం వేసిన ధాన్యానికి మిల్లులకు తరలించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో చైతన్య, నేరెళ్ల శ్రవణ్ కుమార్, గాజుల మల్లేశం, సురేష్, లత, రమ, చక్రం,రాజ్ కుమార్, నీలం రవి, బండారి రాజు పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

మేడిపల్లి: రైతులు పంటకోసి రెండు నెలలు పూర్తవుతున్న ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. నెలరోజుల నుంచి వివిధ కారణాలతో సెంటర్ నిర్వాహకులు తమను ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వివరించారు. రైతులను ఇబ్బందులు పెడుతూ రాక్షస ఆనందం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ వేములవాడ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, తొగరి లక్ష్మీపతి, ధర్మారెడ్డి, ఇబ్రాయిల్, దాసరి రఘు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతులు కల్పిస్తాం



డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న కృష్ణారావు

కోరుట్ల రూరల్: పట్టణ శివారులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణ శివవారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను శనివారం సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కోరుట్లలో 5 వేల ఇళ్లు నిర్మించి అన్ని వసతులు కల్పించామని, ఇప్పుడు గత 10 ఏండ్లలో బీఆర్ఎస్ హయాంలో కోరుట్లలో కేవలం 80 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇచ్చి సరైన వసతులు కల్పించలేదని పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ తిరుమల గంగాదర్ గౌడ్, బాస రాజేశ్, నర్సయ్య, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

మెట్‌పల్లిరూరల్:ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు.మెట్‌పల్లి మండలం వేంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ధాన్యం విక్రయించిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో పంట డబ్బులు వేస్తుందన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

పెగడపల్లి: మండలంలో రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఈవో నవీద్ పేర్కొన్నారు. ప్రభుత్వం జీలుగ విత్తనాలను 60 శాతం రాయితీపై సరఫరా చేస్తుందని, 30 కిలోల బస్తాకు రాయితీ పోనూ ధర రూ. 1116 రైతు చెల్లించాలని తెలిపారు. రైతులు సోమవారం నుంచి వీటిని తీసుకోవచ్చని పేర్కొన్నారు.

నాచుపెల్లి జేఎన్టీయూ ప్రిన్సిపాల్ బదిలీ

కొండగట్టు: నాచుపెల్లి జెఎన్‌టీయూ ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్ హైదరాబాద్‌కు శనివారం బదిలీ అయినట్లు సమాచారం. కాగా శనివారం యూనివర్సిటీలో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అయితే తిరిగి మంగళవారం రిలీవ్ అవనున్నట్లు తెలుస్తుంది.

రిజిస్ట్రేషన్ చార్జీల విలువ పెంచొద్దని వినతి



వినతి పత్రం ఇస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

కోరుట్ల రూరల్: పట్టణంలోని భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచవద్దని కోరుతూ కోరుట్ల రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడా లేని విధంగా కోరుట్ల పట్టణంలో భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచారని మళ్లీ పెంచితే చాలా ఇబ్బందులవుతాయని పేర్కొన్నారు. 2012 కంటే ముందు గజం ధర రూ.1100 ఉండగా 2012 తర్వాత రూ.2000 పెంచారని, 2020 లో రూ. 3000 వరకు పెంచారని, ఇప్పుడు రూ. 4100 వరకు పెంచారని ఈ ధర భూమి మార్కెట్ విలువ కంటే ఎక్కువ అవుతుందని, ఇది భూములు కొనుగోలు చేసేవారికి తీవ్ర భారం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం దరల పెంపుపై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఏపూరి శ్రీనివాస్ గౌడ్, గౌరవ సలహాదారు పాయికారి రమేశ్, అధ్యక్షుడు జంగంపల్లి రాజరెడ్డి, కార్యదర్శి సిరిపురం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లిలో కంది లక్ష్మీనర్సమ్మ, నారాయణ, బొమ్మన వెంకమ్మ, బుచ్చయ్య జ్ఞాపకార్థం శనివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. క్రీడాకారులకు బొమ్మన భీమయ్య, బొమ్మన కుమార్, కూతురు ముక్తామని,నరేందర్ రూ.40,000 విలువచేసే క్రికెట్ సామగ్రి, టీ షర్ట్స్, కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చింతపంటి శశికళ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

20న బీడీ యాజమాన్యంతో చర్చలు

కోరుట్ల రూరల్: రాష్ట్రంలో వివిధ బీడీ పరిశ్రమల్లో పని చేస్తున్న టేకేదారుల కమీషన్ పెంపు విషయంలో ఈ నెల 20 న బీడీ కంపెనీల యాజమాన్యంతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు అన్నారు. కమీషన్ రేటు గడువు మార్చి నెలతో ముగిసినందునా.. రేట్లు పెంచాలని లేకుంటే సమ్మె చేస్తామని నోటీస్ ఇవ్వడంతో యాజమాన్యం చర్చలకు ఆహ్వానించిందన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్-1,టౌన్-2 పరిధిలోకి కాలనీల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు.

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని మైతాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ హరీశ్ తెలిపారు.

పిచ్చి మొక్కలు తొలగించారు..



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో కాలువ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలను ట్రాన్స్‌కో అధికారులు శనివారం తొలగించారు. ఈ నెల 15న 'ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్' అనే ఫోటో స్టోరీ సాక్షిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కలతో పాటు , చుట్టూ కంచె వైపు ఉన్న మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

సాక్షి స్పందన

ఘనంగా వాసవీ మాత జయంతి





జగిత్యాల, రాయికల్ లోని వాసవీ మాత ఆలయాల్లో పూజలు చేస్తున్న మహిళలు



ధర్మపురిలో మహిళల కుంకుమార్చన

జగిత్యాలటౌన్/రాయికల్/ధర్మపురి/మల్లాపూర్/కోరుట్ల రూరల్/సారంగాపూర్: జిల్లా కేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో, కోరుట్లపట్టణం,రాయికల్, ధర్మపురి, మల్లాపూర్, సారంగాపూర్ మండలం పెంబట్ల ఆలయాల్లో శనివారం వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆర్యవైశ్య నాయకులు, మాతలు, భక్తులు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: ఓ మహిళను అసభ్య పదజాలంతో దూషించి చంపుతానని బెదిరించడంతో సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.ఎస్సై దత్తాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన రమేశ్ అదే గ్రామానికి చెందిన పత్తి మమత అనే మహిళను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా చంపుతానని బెదిరించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గీతా పఠనంతో మానసిక ప్రశాంతత

కోరుట్ల రూరల్: గీతా పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉత్తమ గీతా ప్రబోదక్ చీలమంతుల ఛత్రపతి ప్రవచించారు. పట్టణంలోని ఝూన్సీరోడ్‌లోని త్రిశక్తి ఆలయంలో గత 18 రోజులుగా గీతా సత్సంగ్ ఆధ్వర్యంలో 76వ గీతా జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం కృష్ణ పరమాత్మునికి లక్ష పుష్పార్చన, 256 రకాల నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వెత్త మంచాల జగన్, కట్కం గణేశ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'మల్లారెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'

గొల్లపల్లి: భూవివాదాల్లో మాజీమంత్రి మల్లారెడ్డి తన పేరును వాడటం సరికాదని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. తనపై వస్తున్న ఆరోపణలు ఖండిస్తూ వీడియో విడుదల చేశారు. తనకున్న 600 గజాల భూమిని శ్రీనివాస్‌రెడ్డికి మూడేళ్లక్రితమే అమ్మానని, ఆ భూమికి.. తనకు ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు. తానేదో అనుచరులను పంపించి భూకబ్జా చేసినట్లు మల్లారెడ్డి తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని దుంపేటలో శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణం శనివారం భక్తజన సందడిలో ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దేవాలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అర్చకులు స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులు పూజలు చేసి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో అర్చకులు, నాయకులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చిన్న మెట్‌పల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం..

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి-గోవిందమాంబల కల్యాణ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో గంగాధర్ గౌడ్, రాజం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది.ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం అర్చనలు,అభిషేకాలు,ప్రత్యేక పూజలతో పాటు కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



నమిలికొండలో జోరుగా మట్టి తవ్వకాలు

కొండగట్టు: కొడిమ్యాల మండలం నమిలికొండలో అక్రమ మట్టి రవాణా జోరుగా కొనసాగుతోంది. గ్రామంలోని పాలిపెల్లి చెరువులో మట్టిని తీసుకునేందుకు ఇటీవల ఓ వ్యక్తి ఐదురోజుల పాటు అనుమతులు తీసుకున్నాడు. నిబంధనల ప్రకారం 1500 క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తీసేందుకు అనుమతులున్నాయి. కానీ సదరు వ్యక్తి మాత్రం తన ఇష్టానుసారంగా 1500 క్యూబిక్ మీటర్ల కంటే అదనంగా చాలా తీస్తున్నాడని, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. దీంతో వారు శనివారం గ్రామంలో చెరువు వద్దకు వచ్చి చెరువును పరిశీలించి వెళ్లారు. ఇదే విషయంపై డీఈ శ్రమిల్ కుమార్‌ను వివరణ కోరగా సుమారుగా 200 క్యూబిక్ మీటర్ల మట్టి అదనంగా తీశారని,అలాగే 18వ తేదీతో కాల పరిమితి ముగిసిందన్నారు. రెన్యూవల్ చేసే క్రమంలో 200 క్యూబిక్ మీటర్లను అందులో జమ చేసి అనుమతులు ఇస్తామన్నారు. గ్రామంలో ఇష్టానుసారంగా నిబంధనలు ఉల్లంఘించి మట్టిని తీస్తే అధికారులు ఏం చేస్తున్నారని గ్రామస్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.